# కొడవటిగంటి

# కుటుంబరావుతో



(కొడవటిగంటి కుటుంబరావుగారు నేలమీద చాప వేసుకుని పొట్టకింద దిండువేసుకొని, ఒకచేత్తో సిగిరెట్టు కాలుస్తూ, ఒకచేత్తో రాసుకుంటూ వుంటారు - గదిలోకి ప్రవేశం మధురవాణి)

**మధుర:** చక్రపాణిగారూ మీరూ కరటక దమనకుల్లా కలసిమెలసి వుండేవారట -

**కొ.కు.:** అదేం పోలిక   పాలూ నీళ్లలా కలిసివుండేవారమని అనక - మేం తెనాలి నుంచీ ఫ్రండ్సమి

**మధుర:** తెనాలంటే గుర్తుకొచ్చింది మీరు రాసిన కథలన్నీ తెనాలి నేపథ్యంలోంచే అని అంటారు నిజమా?

**కొ.కు.:** నీకు విజయనగరం, విశాఖపట్నం ఎల్లాగో నాకు తెనాలి, మద్రాసు అల్లాగ

**మధుర:** మిమ్మల్ని తెలుగువారి చందమామ అంటారు అవునా?

**కొ.కు.:** ఆ టైటిల్ నాకూ చక్రపాణికీ వర్తిస్తుంది మా వెనక విశ్వం, చందమామ రామారావుకూడా వున్నారు చందమామ లైబ్రరీ లాటిది ఎవరికీ లేదు

**మధుర:** విజయా నర్సింగ్‌హోమ్ మీద మీరేదో జోక్ పేల్చారట!

**కొ.కు.:** అదా - (నవ్వి) నేనూ చక్రపాణీ నడుచుకుంటూ పేషంట్సుగా వెళ్ళి నర్సింగ్‌హోమ్‌లో వుండి డిస్చార్జి అయినపుడు స్ట్రెచర్‌మీద బయటకు వచ్చాం- అని పురాణంతో అన్నా నీదాకా వచ్చిందీ!

**మధుర:** కుటుంబరావుగారు దేవుళ్ళని నమ్మరుగాని దెయ్యాల్ని నమ్ముతారని మీమీద జోక్‌వుంది ఏవంటారు?

**కొ.కు.:** (నవ్వి) నా చిన్నప్పుడు తెనాలిలో మాచుట్టాలావిడ ఒకర్తి వుండేది ఆవిడ ఒంటిమీదకు గాలిసోకేది అనేవారు ఆవిడ ఆస్థితిలో గాలి పీల్చేది వదలినపుడు ఎంత గాలివదిలేదంటే అది ఎక్కడనుంచి వచ్చిందా అని ఆశ్చర్యపోయేవాడిని ఒక మనిషి సాధారణంగా అంతగాలిని నిలిపివుంచడం అసాధ్యం

**మధుర:** అంచేత దయ్యాలు వున్నాయంటారు?

**కొ.కు.:** అదేకాదు ఆవిడ గాలిసోకినప్పుడు అనేక భాషల్లో మాట్లాడేది కవిత్వాలు అప్పజెప్పేది మళ్ళా తెలివి వచ్చాక మామూలు మనిషి ఏదో ఒకశక్తి లాటిది లేకుండా యిదంతా ఎలా జరుగుతుంది?

**మధుర:** గురజాడ అప్పారావుగారు దయ్యాల్ని నమ్మలేదు, లుబ్ధావుధాన్లని వూరికే అలా భయపెట్టారుకాని మీరేవిటి యిలాగ?

**కొ.కు.:** అప్పారావుగారు హేతువాది అంటాను

**కొడవటిగంటి కుటుంబరావు**

**మధుర:** మీ కమ్యూనిస్టులు గురజాడ వారినీ వీరేశలింగాన్నీ కాబ్రేడితం చేసేశారు కదా!

**కొ.కు.:** గిడుగువారిని మర్చిపోయావు. అభ్యుదయ కవితోద్యమానికి ఆదిపురుషులన తగినవారు ఆ ముగ్గురూ తరువాత శ్రీశ్రీ మహాప్రస్థానం దానికి మార్గ్సకార్టా అయికూర్చుంది.

**మధుర:** మీ కమ్యూనిస్టులు నెహ్రూని నమ్మి చెడిపోయారంటారు నిజమా?

**కొ.కు.:** నెహ్రూ అతడి సోషలిజం కబుర్లు మేం నమ్మలేదు నెహ్రూ నిజస్వరూపం తెలంగాణా సాయుధపోరాటం తరువాత బయటపడింది

**మధుర:** తెలంగాణాలో పోలీసుచర్య తర్వాత హైదరాబాద్ పారిపోయిన భూస్వాములు వారి తైనాతీలు తిరిగి గ్రామాలలో ప్రవేశించి జాగీర్దార్లు, పటేలు, పట్వారీలు అయి ప్రజలమీద జులుం చలాయించారంటే నెహ్రూ కాంగ్రెస్సు కారణం అంటారు

**కొ.కు.:** నీకీ వివరాలన్నీ ఎలా తెలుసు? ఆనంద గజపతి కాలంనాటి వసంతసేనవి కదా!

**మధుర:** పుచ్చలపల్లి సుందరయ్యగారి లెక్చర్లు విని వచ్చి వెంకటేశం నాతో ముచ్చటించేవాడు నార్ల చిరంజీవి ప్రజాశక్తి, విశాలాంధ్ర తెచ్చి చదివి వినిపించేవాడు తుమ్మల వెంకట్రామయ్యగారు అభ్యుదయకాపీలు మా యింట్లో పడేసేవాడు

**కొ.కు.:** అయితే మావాళ్ళందర్నీ చెడగొట్టేశావన్నమాట (నవ్వు)

**మధుర:** బాగుపడాలంటే ముందు చెడిపోవాలి కదా!

**కొ.కు.:** నీలో సెర్చిలైటు వేసి గాలించినా చెడు అనే పదార్థం లేనేలేదు కదా!

**మధుర:** అవునూ మీరు కన్యాశుల్కం నోట్సు అని రాశారు, అవి ఏమయ్యాయి?

**కొ.కు.:** విశాలాంధ్రవాళ్ళూ వెయ్యలేదు విరసంవాళ్ళూ వెయ్యలేదు

**మధుర:** మీ పూర్వీకులు-

**కొ.కు.:** అల్లపుడెప్పుడో మహారాష్ట్ర నుంచి వచ్చి యిక్కడ సెటిలయిన బాపతు అని విన్నా

**మధుర:** మీ అన్నగారుండేవారట వెంకటసుబ్బయ్య గారని

**కొ.కు.:** మా అన్నయ్య కొడవటిగంటి వెంకటసుబ్బయ్య కవి, కథకుడు ఆయన యింట్లోంచి వెళ్ళిపోయాడు మళ్ళీ తిరిగి రాలేదు. బైరాగుల్లో కలిసిపోయాడంటారు మమ్మల్ని చూడ్డానికి మారురూపాల్లో వచ్చాడంటారు వెళ్ళిపోయిన వారిగురించి అదిగో వస్తాడు-యిదిగో వస్తాడని అనుకోవడం ఎదురు చూడటం కుటుంబాల్లో సహజమేగా!

**మధుర:** మీ అన్నగారి కథలు పోగుచేసి ఒక పుస్తకం వేయలేకపోయారా!

**కొ.కు.:** ఏమిటో ఆ ఆలోచనే రాలేదు. వైతాళికుల్లో ముద్దుకృష్ణ ఒకటీ అరా పద్యాలు వేశాడు

**మధుర:** చదువు నవల మీ జీవిత చరిత్రలాటిది అంటారు సత్యమేనా-

**కొ.కు.:** అప్పటి కుటుంబాల స్థితి, నా చిన్నతనం, నాటి వాతావరణం అందులో వున్నాయి

**మధుర:** మీరు చిన్నకథను మేడేజీ చేశార్ట - అవునా?

**కొ.కు.:** కథ రాయడం కష్టమేమీకాదు ఎవరైనా రాయవచ్చు కొత్తవాళ్ళు యువకులు బాగా రాస్తారు యువకుల చేతుల్లోవుంది కథానిక ఒక రచయిత రాసిన పదికథలలో కన్నా పదిమంది రాసిన పది కథలలో వైవిధ్యం వుంటుంది అన్నాను

**మధుర:** ఉం కోటి మంచి ముక్క అన్నారు, ఆడవాళ్ళగురించి - అదేవిటమ్మా-

**కొ.కు.:** జీవితానికి కేంద్ర బిందువు స్త్రీ, స్త్రీ చుట్టూ విస్తరించి వుంటుంది జీవితం అన్నా

**మధుర:** మీకు ఎమోషన్ లేదు, ఉద్రేకం లేకుండా రాస్తారని అంటారు అదేవిటి?

**కొ.కు.:** నేను సైన్స్ చదువుకున్నాను కాబట్టి నాది మొదటినుంచీ విశ్లేషణాత్మకమైన మార్గం కవిత్వం నా వంటికిపడదు కవిత్వ దృక్పథం లేని వచన రచయితని

**మధుర:** పాత రచయితలకి కొత్త రచయితలకి మధ్య అక్షాంశరేఖలా వున్నారంటారు మీరు అంటే కుటుంబరావు తర్వాత వచ్చిన కథకులూ ముందువచ్చిన కథకులూ అని విడగొట్టి చూడాలంటారు కొత్త విమర్శకులు

**కొ.కు.:** ఎవరాకొత్త విమర్శకులు?

**మధుర:** మీమీద వ్యాసం రాస్తూ సుబ్రహ్మణ్యశర్మ అలాగన్నాడు అతను మీ వారసుడా?

**కుటుంబ:** ఇది మళ్ళీఫ్యూడల్ ఆలోచన జర్నలిజంలో నాతరవాతవాడు పురాణం. కథక చక్రవర్తులు, మహాకవులు, కవి సామ్రాట్టులూ యిదంతా ఫ్యూడల్ సెటప్‌లోంచి వచ్చి మన్నిపట్టుకు పీడుస్తున్న బిరుదుల సంత

**మధు:** బిరుదులంటే మీకు గిట్టదా?

**కొ.కు.:** ఇంగ్లీషులోలాగ మేజర్ రయితలూ, కవులూ, మైనర్ రచయితలూ, కవులూ అని వుంటారుగాని యీ అనవసరపు టైటిల్స్‌ని ఎందుకు మోసుకుంటూ తిరగడం? కీర్తికాయం అసలు శరీరం కన్నా బరువు

**మధుర:** మహాకవి శ్రీ శ్రీ అంటే మహాకవి అన్నందుకు శ్రీశ్రీగారు సంతోషిస్తాడు కదా! అలాగే విశ్వనాథ వారు కవిసమ్రాట్ అన్నందుకూ

**కొ.కు.:** అవన్నీ వీక్నెస్సులు - శ్రీశ్రీ అంటే చాలదా! విశ్వనాథ అంటే చాలదా?

**మధుర:** మీ కమ్యూనిస్టులుకూడా యుగకవి, యుగకర్త అని బిరుదులు తగిలిస్తారు కదా, మీరేమంటారు?

**కొ.కు.:** అవి కమ్యూనిస్టుల్లో కూడా యింకాపోని ఫ్యూడల్ వాసనలు ఈ సొసైటీ నుంచేకదా వాళ్ళూ వచ్చింది కమ్యూనిజం దేశంలో రాకముందు కమ్యూనిస్టులు ఊహించుకున్న సిద్ధాంతాల ప్రకారం మసలుకుంటారు ఏంచేస్తాం? పేపరు టైగర్సు !

**మధుర:** కమ్యూనిస్టులు దేశభక్తులు కారు; దేశభక్తి అనేది బూర్జువా లక్షణం - అంటారుట

**కొ.కు.:** నీకు యీ మాటలు ఎవరు నేర్పారు?

**మధుర:** గిరీశంగారు కొన్నాళ్ళు ఆరెస్సెస్‌లో తిరిగారు. అప్పుడాయన కొంతకాలం యాంటీ కమ్యూనిస్టు కూడా. అవును మీరు చందమామలో రహస్యంగా కమ్యూనిస్టు భావాల్ని ప్రచారంచేసేవారట నిజమేనా?

**కొ.కు.:** కథల్లో చిన్నపిసరు ప్రజలపక్షం గెలవడం అదీవుంటే, బీదవాళ్ళకు అన్యాయాలు జరిగితే, వాళ్ళు తిరగబడితే అదంతా మార్క్సిజమంటే ఎల్లాగ? నువ్వీ కొత్త తగూ ఓటి తీసుకురాకు. పైగా మాచక్రపాణిగారు యిట్టే కమ్యూనిస్టు వాసన పట్టేసి అల్లాటివేవీ రాకుండా జాగ్రత్తపడతాడు. ఇన్నేళ్ళు చందమామలో 'ప్రేమించాను', 'ప్రేమ' అన్నమాటలు దొర్లకుండా జాగ్రత్తపడ్డాం పిల్లల పత్రికలో పెద్దవాళ్ళమాట అదెందుకు అని దాన్ని టాబూ చేశాడు చక్రపాణి

**మధుర:** చందమామ నేనూ చదువుతూ - అందుకే అడిగా ఏమీ అనుకోకండి మీకు హార్మనీ వచ్చా? సంగీతం అంటే చాలా ఇష్టమని విన్నాను

**కొ.కు.:** నేను చిట్టిబాబు వీణకచ్చేరి ఎక్కడ జరిగినా మా ఆవిడతో వెళ్ళి విని ఆనందించివచ్చేవాడిని. చిట్టిబాబు నన్ను ముందు వరసలో వచ్చి కూచోమనే వాడు శ్రోతలతో కలిసిపోయి, వాళ్ళ వ్యాఖ్యానాలు ప్రశంసలు ఒక చెవినా, మీ కచేరీ మరొక చెవినా వింటూంటే గొప్ప థ్రిల్లింగ్గా వుంటుంది మన స్నేహాన్ని బయటి పెట్టి అదిపాడు చేయకండి - అని చిట్టిబాబును వారించా

**మధుర:** నాది బొబ్బిలి వీణ నేను వాయిస్తూంటే వింటూ తన్మయులైపోయేవారు అప్పారావుగారు మీకు కర్ణాటకమా, హిందూస్థానీయా ఏది అభిమానం?

**కొ.కు.:** హిందూస్థానీలో కరీంఖాన్, ఫయాజ్‌ఖాన్, బడేగులాం ఆలీఖాన్ లాంటివారిని ఆరాధిస్తే - కర్ణాటకలో సెమ్మంగుడి, అరియకుడి, సుబ్బులక్ష్మి, చెంబై, మదురమణి, బాలమురళి వగైరాలని అభిమానిస్తా

**మధుర:** మరి సినిమా సంగీతంలో

**కొ.కు.:** సైగల్ని తప్ప ఎవర్నీ నేనంతగా మెచ్చుకోను

**మధుర:** లతామంగేష్కర్ గురించి ఏమంటారు?

**కొ.కు.:** లతామంగేష్కర్ కంటే ఆశాభోంస్లే గొప్ప గాయని అంటా సంగీతంలో లత, గానంలో ఆశా ఒకరినొకరు మించుతారు.

**మధుర:** మీది శ్రావ్యమైన గొంతు అని విన్నా.

**కొ.కు.:** నన్ను నేను పొగుడుకోను. నాకు హార్మనీ యిష్టం. వాయిస్తా - బొంబాయి వెళ్ళి బాలగంధర్వ, దీనానాథ్, మాస్టరు కృష్ణారావుల పాటలు ప్రత్యక్షంగా వినివచ్చా. మా అబ్బాయి రెండో వాడు రోహిణీ ప్రసాద్ సితార్ బాగా వాయిస్తాడు.

**మధుర:** పాత రికార్డులున్నాయా మీ దగ్గర.

**కొ.కు.:** అది నా హాబీ. ఒకసారి చిట్టిబాబును అడిగా - ' ఒకే రాగానికి రెండు వెర్షన్సు వుంటాయా?' అని. వుండవు అన్నాడు. రెండురకాల ట్రీట్‌మెంట్సు వుంటే వుంటాయి అన్నాడు.

**మధుర:** అయితే మీది విమర్శనాత్మక పరిశీలన అన్నమాట మీకు సినిమాలతో బాగాపరిచయం వుందిగా, ఎప్పుడైనా సినిమాల్లో నటించారా?

**కొ.కు.:** నిడుమోలు జగన్నాథ్ అప్పుడు యువక డైరక్టర్, ప్రొడ్యూసర్. 'తారుమారు' 'భలేపెళ్ళి' అనే రెండు పొట్టి హాస్యచిత్రాలను తీశాడు. అందులో 'తారుమారు'లో వేశాను. సంభాషణలు నేనే రాశా. సంగీతం రజనీకాంతరావ్

**మధుర:** కామమ్మ మొగుడ్ని కాకపోతే కర్రబుర్రా ఇవతల పారేయండి లేచిపోతా - అన్న సామెత థీమ్‌మీద రాశారట ఏమిటి?

**కొ.కు.:** 'లేచిపోయిన మనిషి' పెద్ద కథ. భారతి రజతోత్సవ సంచికలో వచ్చింది అది రేడియో నాటకంగాకూడా రాశాను; రజని ప్రోద్భలంతో

**మధుర:** కొత్త పత్రికలన్నిటిలో మీరు రాసింది ఏదో వుండేది లాంఛనంగా - వాళ్ళు అడిగేవారా?

**కొ.కు.:** పోనీ పాపం అని ఏదో ఒకటి రాసి పంపేవాణ్ణి వాళ్ళను నిరుత్సాహ పరచకుండా నేను దేనికీ పొంగిపోలేదు కుంగిపోలేదు

**మధుర:** శంకరాభరణం గూర్చి మీరేమంటారు?

**కొ.కు.:** కథలో గొప్పతనం యేమీలేదు కానీ తీసిన విధానం అందులో యువకుడు కానివాడిని కథానాయకుడుగా తీసుకోడం, నడివయస్సుదాటిన పాత్ర ప్రేమభావన, ఇవి గొప్పవి అదలా ఉండగా సినిమారంగంలో స్టార్ వాల్యూ సిస్టమ్‌ను శంకరాభరణం ధిక్కరించింది. చవకబారు సన్నివేశాలతో యువతరాన్ని పెడదారులు పట్టించే నిర్మాతలకు షాక్ యిచ్చింది.

**మధుర:** కమ్యూనిస్టుగా యీ సినిమాని ఒప్పుకుంటారా?

**కొ.కు.:**అదే ఇందులో ఉన్న పెద్దచిక్కు భూస్వామ్య విలువలను ప్రతిబింబించి వాటికి హారతిపట్టింది అదీ గొడవ-

**మధుర:** సినిమా నిర్మాతాలు సినిమా కథలను తమ చిత్తం వచ్చినట్లు మారుస్తూ వుంటారుకదా! మీరేమంటారు?

**కొ.కు.:** రచయితలను ఆర్థిక వత్తిడితో అందుకు ఒప్పించడం వ్యభిచారం వంటిది

**మధుర:** చైనాలో గ్యాంగ్ ఆఫ్ ఫోర్‌ను నిర్బంధించడం ఎటువంటిది?

**కొ.కు.:** హువా కువోఫెంగ్, తెంగ్ శియాజ్ ఫెంగ్ నాయకత్వంక్రింద నిర్బంధించడం సరైనచర్య. అయితే, కృశ్చెవ్‌కూ తెంగ్‌శియాబ్ ఫెంగ్‌కూ ఏవీ తేడాలేదు.

**మధుర:** మీరు విప్లవ రచయితల సంఘం పెట్టడానికి కారణం?

**కొ.కు.:** స్వాతంత్ర్యం మనకు వచ్చి యిన్ని దశాబ్దాలు దాటుతున్నా ప్రజల ఆర్థికస్థితి,

సామాజిక దురాచారాలు పెరుగుతున్నాయే కాని తగ్గడం లేదు. బీదలను ఉద్ధరిస్తామని వారి ఓట్లతో గెలిచి ఆ తర్వాత భూస్వామ్య, ధనికవర్గాలకే అనుకూలంగా పాలించడం మామూలయిపోయింది మార్క్సిస్టు సిద్ధాంతాలకు వారసులమనే వారు పంచవర్ష ప్రణాళికారచనకు కూర్చున్న మేధావులవలె - ఏయే చిట్కాలు ప్రచారంలో పెడితే, ఏయే పార్టీలతో పొత్తు కలుపుకుంటే, ఎన్నికలలో అధికంగా లాభిస్తుంది - అన్న చర్చలతో తలమునకలవుతున్నారు ఇట్టి పరిస్థితిలో పీడిత ప్రజలను చైతన్యవంతులను చేసే ఆశయంతో రావిశ్రాస్త్రి, వరవర రావు, కాళీ పట్నం, కె వి ఆర్ మొదలైన రచయితలతో కలిసి విరసాన్ని స్థాపించాం

**మధుర:** ఏమండీ మీరు ఒక ట్రక్కుకు సరిపడ్డ రచనలు చేశారుకదా! పదికాలాలు నిలిచే ఒక గొప్ప పాత్రను సృష్టించలేకపోయారే?

**కొ.కు.:** (నవ్వి) అల్లాటివారు నిజంగా వుండరు నేటి వ్యవస్థలో - ఒకవేళ నా డిటెక్టివ్ కేయాస్ నిలుస్తాడేమో?

**మధుర:** మీ హాబీలేమిటి?

**కొ.కు.:** తోటపని, ఫొటోగ్రఫీ

**మధుర:** చందమామను మీరంతా పిల్లలకోసం చేసినా దాన్ని విరివిగా పెద్దవాళ్ళు చదువుతారని అంటారు - అవునా?

**కొ.కు.:** ''చందమామను నాచేత కూడా చదివిస్తున్నారు హాయిగా బావుంటుంది లేటుగా వస్తే కొట్టువాడితో దెబ్బలాడతా యింకా రాలేదేమని-'' అన్నారు విశ్వనాథ సత్యనారాయణ గారు

**మధుర:** మీకు యిష్టమైనవి ఏవి?

**కొ.కు.:** ప్రముఖ చరిత్రకారుడు కోశంబి పరిశోధనలు, సుమేరియన్, బాబిలోనియన్, సిరియన్, ఈజిప్షియన్, హరప్పా - మొహంజదారో నాగరికతలగురించి, హిందూ సమాజపరిణామాల గురించి మాట్లాడడం యిష్టం నాకు

**మధుర:** మీరు ప్రతిదినం డైరీ రాసేవారా? ఏం రాస్తారండీ-

**కొ.కు.:** సామ్యూల్ పెప్పీస్‌లాగ ఎప్పుడైనా చూస్తారుగా! (శ్రీమతి వరూధిని, చలసాని ప్రసాద్, యీపనికి పూనుకోవాలి) నేను ఇన్‌వాలీడ్ ని, ఎందుకండీ బ్రదకటం అంటే చందమామ రామారావు 'మీరు కలంపీరులు; వుండాలి' - అలా అనేవాడు (నువ్వు).

**మధుర:** మీ వ్యక్తిత్వంలోని ముఖ్య లక్షణం?

**కొ.కు.:** మనస్సుకీ దేహానికి సోమరితనం అనేది లేకపోవడం

**మధుర:** మీ అలవాట్లలో ముఖ్యమైనది?

**కొ.కు.:** ఉత్తరాలకు వెంటవెంటనే జవాబులివ్వడం

**మధుర:** చాలామంది రచయితలు తాము చెప్పేది ఒకటీ చేసేది వేరుగానూ వుంటుంది. మీరూ -

**కొ.కు.:** రచయితగా నాకు ఏ అభిప్రాయాలు వుండేవో వ్యక్తిగా కూడా నావి అవే భావాలు.

**మధుర:** మీ నిజాయితీ నూటికి నూరుపాళ్ళు అన్నమాట రామప్పంతులు, గిరీశాల్లా కాదు. పూజల పునస్కారాలు వుండేవా?

**కొ.కు.:** లేవు. ఒకసారి మా పొరుగువాళ్ళు 'రాధాకళ్యాణం' నిమిత్తమై చందాలు వసూలు చేద్దామనివస్తే - రాధ ఎవరు? ఆమె కళ్యాణం తమరెందుకు చేయాలని అడిగా. వచ్చినవాళ్ళు తెల్లబోయి తిరిగి వెళ్ళిపోయారు.

**మధుర:** మీరు తుడుపులు కొట్టివేతలు లేకుండా ఒక్కసారే ఎలా రాస్తారు?

**కొ.కు.:** రాసే వేగము, ఆలోచించే వేగమూ సమానంగా వుండాలి ఏది ఎక్కువైనా కష్టమే. ఇది అభ్యాసంవల్ల సాధ్యం.

**మధుర:** మీరు డాక్టర్ని ఓసారి మందలించారట కదా?

**కొ.కు.:** మానసికంగా నాకేవీ 'ముసలి' లక్షణాలుండేవి కావు 1979లో నాకు బాగా జబ్బుచేసింది. అప్పుడు బ్రెయిన్ స్పెషలిస్ట్ నాకు రోగ లక్షణాలను వివరిస్తే ' ఎప్పటికైనా పోవలసిందేకదా' అన్న ధోరణిలో మాట్లాడితే అతన్ని కోప్పడి - అది కర్మవాదం అవుతుంది వైద్యం కాదన్నాను.

**మధుర:** మీరు కృష్ణశాస్త్రి కవితను సన్నాయి వాయిద్యంతో, శ్రీశ్రీ కవితను డోలుతోను పోల్చారటకదా! మరి విశ్వనాథ?

**కొ.కు.:** థణ థంగిణాం,

థథోంగిణ థద్దిణాం
మద్దెలల మ్రోతలై
కిన్నెరటు సోలి యిటు సోలి
తుడుములా కదలాడెనే

అని ఆయనే చెప్పుకున్నట్లు మద్దెలమోతలతో పోల్చవచ్చు.

**మధుర:** మీరు చందమామకి కథలు చదవటం, ఎంపిక చెయ్యటం బ్రెయిన్ వర్క్ అంటారా?

**కొ.కు.:** చందమామ ప్రచురణకు వచ్చే కథలు చదవటం కోడిరామమూర్తి గుండెలమీద ఏనుగుని ఎక్కించుకున్నంత పని అది. తేలిక్కాదు.

**మధుర:** జర్నలిజంలో మీ స్వానుభవం కొద్దిగా చెప్పండి?

**కొ.కు.:** ఇన్నేళ్ళు జర్నలిజంలో నానివుండి నేను నేర్చుకున్న దేమిటంటే వైజ్ఞానిక విషయాలు ఆకర్షించేది నూటికొక్కడినే. అటువంటి వాటితో సర్క్యులేషన్ పెరగదు. కాని కీర్తి వస్తుంది. కీర్తి మామూలు పాఠకుల పత్రిక్కి ఏనాడూ కట్టబెట్టలేరు. డబ్బు లిచ్చుకుంటారు. సర్క్యులేషన్ పెంచుతారు. కొంత అప్రతిష్ఠకూడా తెస్తారు అదీ సంగతి.

**మధుర:** పత్రికల సర్క్యులేషన్ పెరగాలంటే ఏం చేయాలి?

**కొ.కు.:** రావిశాస్త్రి రచనలకు మాస్ రీడర్ రెస్పాండు కాడు. మనవాళ్ళుత్త వెధవాయిలోయ్ అన్నట్లు - వాడికి పట్టదు. సర్క్యులేషన్ పెరగాలంటే కాస్త శృంగారం గురించి, సర్కారు సారా లాంటిది పడాలి. జన బాహుళ్యానికి బేనాలిటీ యిష్టం.

**మధుర:** షష్టిపూర్తి జరిగాక ఎలావుంది మీకు?

**కొ.కు.:** అక్కడక్కడ వచ్చిన నామీది వ్యాసాలు నన్ను చాలా డిప్రెస్ చేశాయి. ఏళ్ళు రాగానే సరా-

**మధుర:** మీ తృతీయ వివాహం విశేషాలు చెప్పండి.

**కొ.కు.:** 1945లో మద్రాసులో కొమ్మూరి పద్మావతి ప్రథమ పుత్రిక వరూధినితో రిజిస్టరు పెళ్ళి జరిగింది శ్రీశ్రీ, మా గోఖలే సాక్షి సంతకాలు చేశారు. బళ్ళారి రాఘవగారి నుండి శుభాశీస్సులొచ్చాయి

**మధుర:** మీ అభ్యుదయ భావాలు మీ ఉద్యోగాలు ఊడేందుకు చాలా దోహదం చేసినాయట కదా!

**కొ.కు.:** అవును. శంభుప్రసాద్ గారితో ఆంధ్రపత్రికలోంచి ఉద్యోగం మానేసి వచ్చేప్పుడు యిలా అన్నా ఆంధ్రసచిత్ర వారపత్రికను మూడువేలనుంచి పాతికవేల దాకా తీసికెళ్ళాను. మీకు నా మీద ఎంతకోపంవున్నా తిరిగి పాతికవేల నుంచి మూడు వేలకు తీసికెళ్ళడం మీతరం కాదు అని

**మధురవాణి:** (వీణమీద సంగీత సాధన చేస్తూ వుంటుంది.) బుద్ధితక్కువ వాదం ఏమిటి కుటుంబరావు గారూ?

**కొ.కు.:** వాద్యంబులలోన వీణా 'సరస్వతిలా వీణ వాయించుకోక నీకు ఆ సైన్సు గొడవ ఎందుకు? బుద్ధి తక్కువవాదం కాదు. 'బుద్ధికొలత వాదం, అసాధారణ అనుభవం' అని రాశాను

**మధుర:** అసాధారణ అనుభవాలేమిటి? అంటే మీరు మూఢ నమ్మకాలను సమర్థిస్తున్నారా!

**కొ.కు.:** బుద్ధికొలతవాదం భౌతికవాదమే. నేను ఏ మూఢనమ్మకాలనూ సమర్థించటం లేదు.

**మధుర:** మీరు చనిపోయినపుడు జరిగిన సంతాపసభలో ఏదో గొడవ జరిగిందటకద? అభ్యుదయ సాహిత్యానికి భౌతిక కృషిగా నివాళులు అర్పించారు ఐతే చివరలో మీరు స్యూడోసైన్సు భావాలను గుర్తై అశాస్త్రీయ భావాలను ప్రచారం చేయటం శోచనీయమని జన. సాహితీ, సాంస్కృతిక సమాఖ్య అభిప్రాయపడింది.

**కొ.కు.:** ఏడిసింది.

**మధుర:** మీరన్నట్లే సత్తెనపల్లినుంచి డా పి. గిరిజాగారు జనసాహితీ ఒక తుక్కు సంస్థకదా! కొ.కు.వంటి వ్యక్తినే మన్నించి, వీరిమీద కొరగాని విమర్శలు చేసినవారు, మీ అశాస్త్రీయ ధోరణిని ఖండించారు

**కొ.కు.:** బుద్ధికొలత అనేది నాల్గవ పరిమాణం అని నా ఉద్దేశ్యం. భౌతికవాదులు బుద్ధికి ఇవ్వాల్సినంత ప్రాముఖ్యం ఇవ్వలేదు

**మధుర:** త్రిపురనేని మధుసూదనరావు, కె వి రావు ఒప్పుకుంటే బుద్ధికొలత ఉన్నట్లేనా! వాళ్లెంత అభ్యుదయవాదులో అంతతీవ్రంగా కొత్తను ద్వేషిస్తారు విశ్వేశ్వరరావుగారు ఒక పుస్తకం వేసి మిమ్మల్ని సమర్థించారు. బుద్ధికి ప్రాధాన్యం ఇవ్వం అని కమ్యూనిస్టులు బుద్ధి గురించి అది లేనట్లు మాట్లాడటం వింతగా వుంది

**కొ.కు.:** గురజాడ 'మనవాళ్ళు ఉత్తవెధవాయిలోయ్' అన్నారు బహుశా వీళ్ళేగావోలు డా బి సూర్యనారాయణరెడ్డి ఆక్షేపిస్తూ ఒక వుత్తరం రాశాడట నేను కోరింది కూడ విపులంగా చర్చజలగాలనే.

**మధుర:** మిమ్మల్ని విమర్శించినవారు చాలా జ్ఞాన దారిద్ర్యంలో కొట్టుకుంటున్నా, అదీ అనుభవమే కదా!!

**కొ.కు.:** అన్నింటినీ శంకించడం అనేది జ్ఞానదారిద్ర్యమేగాని శాస్త్రీయ పరిజ్ఞానం కాబోదు

**మధుర:** వేరు భావాలలోకి జారుకుంటున్నారని వారి భయం

**కొ.కు.:** ఏదో విమర్శ చేయడం మన భౌతికవాదం, సోమరితనం అవుతుంది. మాటవరసకి శాస్త్రస్థాయి రాలేదని పేరా సైకాలజీని కొట్టిపడవేస్తారా?

**మధుర:** సామాన్య ప్రజలకి తిండి, గుడ్డ, వినోదం తప్ప మరేమీ అక్కరలేదు మనం మరొకవిషయం ఆలోచిస్తే అది సాంఘిక అపచారం అవుతుందా!

**కొ.కు.:** అవుతుందో అవదో తెలియదు కాని నీది కడుపు నిండినవాళ్ళ భాష

**మధుర:** ఏ భావజాలమైనా ప్రజల కడుపు కొట్టడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను దోహదం చేసితీరుతుంది

**కొ.కు.:** వాళ్ళకి కడుపు నింపుకోటానికి అవసరమైన పోరాటచైతన్యం ఇస్తే చాలని కమ్యూనిస్టుల అభిప్రాయం బుద్ధికొలత వ్యాసాలు బీదప్రజలకి తోడ్పడవు.

**మధుర:** సామ్రాజ్యవాదుల, భూస్వాముల, కాంగ్రెస్ వాళ్ళ దోపిడీని నిర్మూలించడానికి బుద్ధికొలత వ్యాసాలు తోడ్పడతాయా?

**కొ.కు.:** నేను అశాస్త్రీయ నిర్ధారణను చేశానని అంటున్నారు నాబుద్ధి కొలతవాదం గురించి మేధావులు కావాల్సినన్ని పరిశోధనలు చేసుకోవచ్చు. నాప్రతిపాదనలని తిరస్కరించినా సంతోషమేగాని భరించలేని మేధావుల సోమరితనానికి నా జోహారులు.

**మధుర:** మార్క్సిస్టులనుకున్న వాళ్ళు సంశయవాదులు. మీ బుద్ధికొలత వ్యాసాలు భావవాదాన్ని, మాంద్యాన్ని సమర్థిస్తాయని మార్క్సిస్టులు అంటున్నారు

**కొ.కు.:** అవును నేను నా బుద్ధికొలత వాదంతో మార్క్సిజాన్ని సమర్థిస్తున్నాను.

**మధుర:** మీరు ప్రజలను తప్పుదారిన పట్టించి వారిపోరాటాన్ని, చైతన్యాన్ని నిర్వీర్యం చేసేరంటున్నారు. అతీత శక్తులనేవి ఎండమావులు. పేరాసైకాలజీ కుహనాశాస్త్రం. మీరు వాటిని నమ్ముతారు. వాటికి శాస్త్రీయమైన తొడుగు తొడుగు తారు.

**కొ.కు.:** అసలు బుద్ధి అనేది జగత్తులో ఒక ప్రత్యేకవిభాగం అన్నదాంతో మీరందరూ ఏకీభవించాలి.

**మధుర:** శాస్త్ర నియమాలుకొన్ని శాస్త్ర ప్రగతికి అడ్డుగా వుంటాయేమో?

**కొ.కు.:** శాస్త్రజ్ఞానంలో చరమసత్యం అంటూ ఏదీ లేదు ప్రతీదీ తాత్కాలికమే. జ్ఞానవృద్ధి అయ్యేకొద్దీ సదసత్ సంశయాలు బలమైనవి. కాలము, స్థలము అనేవి సాపేక్షకాలు.

**మధుర:** శాస్త్రజ్ఞులు తెలుసుకొన్నవి పాక్షిక సంశయాలే.

**కొ.కు.:** శాస్త్రజ్ఞులకు సత్యాలలో నమ్మకముంటుంది కాని పూర్తి సత్యాలు వాళ్ళకి తెలియవు.

**మధుర:** ఎడింగ్‌టన్, జీన్స్, ఐసన్ బర్గ్‌లను మీరు ఏమంటారు?

**కొ.కు.:** అజ్ఞేయతా వాదానికి గురైన శాస్త్రజ్ఞులు అంటారు.

**మధుర:** సోషల్ సామ్రాజ్యవాదం అంటే ఏమిటండి?

**కొ.కు.:** మాటలలో సోషలిజం, చేతలలో సామ్రాజ్యవాదం అనుసరించటాన్నే సోషల్ సామ్రాజ్యవాదం అని అన్నారు.

**మధుర:** మీరు విరసంలో వుంటూనే రష్యా, తూర్పుయూరప్ దేశాలను సోషలిస్టుదేశాలుగా ఎలా భావించారు. సోవియట్ శాస్త్రవేత్తలు పచ్చి భౌతికవాదులు. అసాధారణ అనుభవాలను భౌతికవాదం దృష్ట్యా మార్క్సిస్టు దృక్పథంలో సమన్వయింప యత్నిస్తారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం అంటూ గంతులు వేస్తుంటారు మీ విరసంవాళ్ళు. వాళ్ళు మీ బుద్ధికొలత వాదాన్ని వ్యతిరేకిస్తున్నారు.

**కొ.కు.:** మార్క్సిజం పిడివాదం కాదు. కార్మికవర్గం వృద్ధిచెంది పెట్టుబడిదారీకి వ్యతిరేకంగా వుద్యమించటంలో ఇది వచ్చింది.

**మధుర:** మార్క్సిజాన్ని బుద్ధికొలతలో ఆచరించటం అంటే దాన్ని పిడివాదం చేయడం కాదా!

**కొ.కు.:** మనం తప్పులనుండి లోపాలనుండి నేర్చుకుంటాము. దీనినే ఆచరణ అంటారు.

**మధుర:** మీరు దయ్యాలున్నాయని అంటారు.

**కొ.కు.:** చచ్చిపోయిన మనిషివచ్చి సోదిలో మాట్లాడటం నేను స్వయంగా ఎరుగుదును. సైకోయనాలసిస్ పూర్తిగా రుజువు అయ్యింది. చాలా విషయాలు విజ్ఞాన శాస్త్రంలో భాగంగా పరిగణించబడలేదు. అదే నాదుర్ద.

**మధుర:** మరణానంతరం మనిషి ఏదో రూపంలో వుంటాడని మీకు నమ్మకం వుందా?

**కొ.కు.:** ప్రపంచమంతటా అనేకచోట్ల ఆయుధాలను, దాసీలను, నగలను, పెళ్ళాలను పాతిపెట్టడాలు చూస్తూ వుంటే చచ్చినవాళ్ళు బతికివున్నప్పటి మనస్తత్వంతో జీవించి వుంటారని నమ్మటానికి వీలవుతుంది.

**మధుర:** మరణానంతర జీవితాన్నీ మీడియంలనూ నమ్ముతూ నానాగొడవ చేశారు. అంటే అశాస్త్రీయమైన నమ్మకాలకు మేలిముసుగు తొడిగినట్లు కాదా!

**కొ.కు.:** హేతువాదం భౌతికవాదం సత్యాన్వేషణ అని ప్రగతి నిరోధకులుగా శాస్త్రవిజ్ఞానం విస్తరించకుండా అడ్డు పడుతున్నారు మూఢ మార్క్సిస్టులు. అదే నా బాధ.

**మధుర:** సామాజిక ప్రొద్దులంతో తద్దినాలు పెట్టి సత్యనారాయణ వ్రతాలు చేసే మార్క్సిస్టుల్ని మీరేమంటారు? చూసీ చూడనట్లు ఊరుకోవచ్చా?

**కొ.కు.:** వారు ఆపనులు చేయరాదు. బుద్ధికొలతలు సరియైన పొలిమేరల్లో లేక వాళ్ళు ఆపనులు చేస్తున్నారంటాను

**మధుర:** అవన్నీ వ్యక్తిగత బలహీనతలు. బుద్ధికొలత అనేదాన్ని ఒక తిట్టుగా అభివృద్ధి చేశారంటున్నారు.

**కొ.కు.:** విరసం సభ్యులకి కూడా భార్యలుంటారు కాబట్టి వారి విశ్వాసాలను పాటిస్తే తప్పులేదనుకొంటాను. బుద్ధిని మెదడుకు అతీతం చెయ్యడం భావవాదం కదా?

**మధుర:** బుద్ధిస్థలం కలల మాదిరే అనాదిది. జ్ఞానేంద్రియాలు లేనిచోట బుద్ధి వుండదుకదా!

**కొ.కు.:** అంటే స్మరణ కోల్పోయినపుడు; నేను అనే జ్ఞానం కోల్పోయిననాడు సామాజిక స్పృహ కోల్పోయిన వాడితో సమానం కదా!

**మధుర:** భిన్న వ్యక్తిత్వం అంటే ఏమిటి?

**కొ.కు.:** అనేక రకాల వ్యక్తిత్వాలు ప్రదర్శించడం. ఒకటి చేస్తున్నప్పుడు మరోటి గుర్తువుండకపోవటం ఇలాంటివాటిని స్ప్లిట్ పర్సనాలిటీలు అని అంటారు

**మధుర:** మీ బుద్ధికొలతవాదం చూసి విరసంవాళ్ళు మీరు వాళ్ళని భావవాదుల లోకి జరిపిస్తున్నారని భయపడుతున్నారు. ఆవాదం అక్కడ వదిలేసి మరో విషయం ఎత్తుకుందాము.

**కొ.కు.:** కొత్త అంటే జడుపు, భయం, అనుమానం; కదా!

**మధుర:** మీరు చందమామలో ఎలకల కథలు బస్తీవి, పల్లెటూరివి రాశారు గుర్తుందీ?

**కొ.కు.:** రాశాను. పల్లెటూళ్ళ నుండి వచ్చిన వాడ్నినేను అది యింకా నీకు గుర్తుందే!

**మధుర:** బకాసురుడ కథ కూడా గుర్తుంది.

**కొ.కు.:** మహాభారతంలో బకాసురకథను నాభావాల కనుగుణంగా మార్చిరాశా.

**మధుర:** నన్నయ్య లాటివాళ్ళు యీ కాలంలో వుంటే వాళ్ళని కూడా ఎక్కిరించారు. బ్రాహ్మణుల జోలికి పిశాచాలు రాకూడదని రూలు కాబోలు.

**కొ.కు.:** అందులో బకాసురుడ్ని రాజు స్వార్థానికి వాడుకుంటాడు. బండివాడి మాటలకు మంత్రి తట్టుకోలేకపోతాడు.

**మధుర:** బకాసురుని కథ రీతిలో పురాణకథల్ని కొన్ని తిరిగిరాయాల్సి వుంది.

**కొ.కు.:** పాతకథల్ని కొత్త రీతిలో చెప్పాలి.

**మధుర:** మధ్య తరగతి జీవితాలను మీరు బాగా చిత్రించారంటారు.

**కొ.కు.:** మధ్య తరగతి సమస్యలను వాస్తవంగా చిత్రించడం 'బెదిరిన మనుషులు', 'బ్రతుకు భయం', 'కొత్తకోడలు' కథల్లో చెప్పాను

**మధుర:** పై కులాలవాళ్ళలాగ వుండాలని క్రిందకులాల వాళ్ళు ప్రయత్నిస్తారని మీరు ఎందుకనుకుంటారు?

**కొ.కు.:** హరిజన యువకుల ప్రవర్తనచూసి పైకులాలవాళ్ళలాగ కనపడాలని హరిజనులు వారిని అనుకరించబోయి అభాసుపాలవుతారు.

**మధుర:** మీరు సినిమారంగాన్ని సజీవం~~ ఎలా చిత్రించగలిగారు?

**కొ.కు.:** మద్రాసులో వుండబట్టి!

**మధుర:** మీరు డిటెక్టివ్ నవలలు రాశారా?

**కొ.కు.:** డిటెక్టివ్‌లను ఎక్కిరిస్తూ కేయాస్ కథలు రాశాను. అవి చాలా పాపులర్.

**మధుర:** మంచి జర్నలిస్టు ఎలా వుండాలి?

**కొ.కు.:** ఇల్లాలి ముచ్చట్లు ఇంట్లో అన్నట్లు సోషల్ ఇన్‌హిబిషన్సుకు గొడ్డలిపెట్టుగా వుండాలి.

**మధుర:** ఆ సౌజన్యారావు పంతులుగాక మీరు గాని నాకు తగిలివుంటేనా! .

**కొ.కు.:** ఆఁ; తగిలివుంటే? ఏం చేసేదానివి?

**మధుర:** శుభ్రంగా మిమ్మల్ని పెళ్ళాడేదాన్ని నన్ను వుంచుకోవడానికి అభ్యంతరమా?

**కొ.కు.:** అది ఫ్యూడల్ వాసన పనికిరాదు

**మధుర:** మిమ్మల్ని పెళ్ళాడితే మీతో వుండి జననాట్య మండలిలో గద్దర్ పాటలకు డాన్సు చేసేదాన్ని.

**కొ.కు.:** నువ్వు నువ్వులా వుంటేనే అందం

**మధుర:** నేను నేనులావుంటే, వుండనిచ్చే సమాజం రావాలికదా!

**కొ.కు.:** బూర్జువా సమాజం పోయాక వస్తుందిలే.

**మధుర:** మంచిది. ★

*(మిసిమి, సెప్టెంబర్, నవంబర్ 1993)*